సిగ్నల్స్ నిర్వహణలో నిర్లక్ష్యం


కొమ్మాది జంక్షన్‌లో ఏడాది కాలంగా విరిగిపోయి ఉన్న సిగ్నల్ లైట్


నిత్యం ప్రమాదాలకు నిలయమవుతున్న కొమ్మాది కూడలి

కొమ్మాది జంక్షన్‌లో ఏడాదిగా పనిచేయని వైనం

మధురవాడ: తరచూ ప్రమాదాలు జరుగుతున్న జంక్షన్లలో కూడా ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొమ్మాది, మధురవాడ జంక్షన్ల వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొమ్మాది జంక్షన్‌లో విశాఖ నుంచి తగరపువలస వెళ్లే వైపు గల సిగ్నల్ లైటు గతంలో ఓ వాహనం ఢీకొనడం వల్ల విరిగిపోయి ఏడాది కావస్తోంది. ఇది పనిచేయక పోవడం వల్ల దగ్గరకి వచ్చే వరకు సిగ్నల్ కనిపించడం లేదు. దీంతో ఇటీవలే ఓ కారు- ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇలాంటి ప్రమాదాలు తరచూ ఇక్కడ జరుగుతున్నాయి. అయినా సిగ్నల్ ఏర్పాటుపై పోలీసు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు.

పోలీసులు మాత్రం లేఖరాశాం అంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. ఉన్నత స్థాయి అధికారులైనా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మధురవాడలో సిగ్నల్స్ సక్రమంగా ఆపరేట్ చేయడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

జీవీఎంసీకి లేఖ రాశాం

సిగ్నల్ విరిగిపోయి పనిచేయకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటి నిర్వహణ బాధ్యత జీవీఎంసీది. కొత్త సిగ్నల్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులకు లేఖరాశాం. మళ్లీ ఇంకో సారి అధికారులను కలిసి సమస్య వివరిస్తాం.

– ఎస్. సాయి, ట్రాఫిక్ సీఐ, నార్త్ జోన్, మధురవాడ

క్లుప్తంగా

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న గోపాలరావు

పద్మనాభం: మండలంలోని బాందేవుపురంలో ఎస్సీ కులస్తులు దెందేటి మంగ, బత్తమ్మలపై ఈ నెల 17న దాడి చేసి గాయపరచిన సాగి కృష్ణమూర్తిరాజు సాగి అప్పలరాజులపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి బాగం గోపాలరావు డిమాండ్ చేశారు. పద్మనాభంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణమూర్తిరాజు, అప్పలరాజుల నుంచి మంగ, బత్తమ్మల కుటుంబాలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఎం.వెంకట శివ, బి.కొండ, న్యాయవాది జి.కృష్ణ పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా సీఐటీయూ ప్రచారం

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న సామాజిక కార్యకర్త కె.రమాప్రభను గెలిపించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఆమెకు మద్దతుగా జీవీఎంసీ 5వ వార్డు కార్పెంటర్స్ కాలనీ, స్వయంకృషి నగర్, వికలాంగుల కాలనీ, ఆర్‌జీకే కాలనీలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, మహిళా సంఘం నాయకులు డి.కొండమ్మ, నాయకులు సీహెచ్. శేషు, ఎస్.రాములప్పడు తదితరులు పాల్గొన్నారు.


తగరపువలస: పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కె.రమాప్రభ తరపున సోమవారం చిట్టివలసలో సీఐటీయూ, డీవైఎఫ్ నాయకులు ప్రచారం నిర్వహించారు. రవ్వ నరసింగరావు, ఎస్.శ్రీనివాసవర్మ, సోమి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ


మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న రంజిత్ కుమార్ పానీ

మధురవాడ: మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని ఉపహార్ సంస్థ అంతర్జాతీయ డైరెక్టర్, ఫౌండర్ డాక్టర్ రంజిత్‌కుమార్ పానీ అన్నారు. ఉపహార్ చైల్డ్ కేర్ సెంటర్ ఆవరణలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఆరు నెలలు టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 10మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, శిక్షణ సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపహార్ ఇండియా మేనేజర్ బి.ఎం. పాల్, సంస్థ విశాఖపట్నం ప్రతినిధులు బి. బెంజిమెన్, బి.చెన్యామిన్, టి.ప్రసన్నకుమార్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్


స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

పద్మనాభం: మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 35 మంది పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల విద్యాకమిటీ ఈ స్టడీ మెటీరియల్‌ను సమకూర్చింది. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కొరెడ్డి సత్యం,హెచ్‌ఎం ఎం.వి.కృష్ణకుమార్, ఉపసర్పంచ్ కె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు


ఆదర్శనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న భీమిలి జెడ్సీ రాము


ఆదర్శనగర్‌లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన ప్రహారీలు

తగరపువలస: మురుగునీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మాణాలు చేపడితే సహించబోమని భీమిలి జెడ్సీ బొడ్డేపల్లి రాము హెచ్చరించారు. సోమవారం రెండో వార్డు ఆదర్శనగర్ శివారు నమ్మివానిపేట రహదారి పక్కన మురుగునీటి ప్రవాహాలకు అడ్డంగా చేపట్టిన నిర్మాణాలను సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గతంలో ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసుకున్న వారు రహదారులు, డ్రైనేజీలకు స్థలం వదలకుండానే ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ఇప్పుడు మిగిలినవారు కూడా తమ స్థలాలకు పూర్తిగా ప్రహరీలు నిర్మించడం వల్ల మధ్యలో ఉన్న ఇళ్ల నుంచి మురుగునీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందన్నారు.

ప్రహరీలు నిర్మించిన వారికి నోటీసులు జారీ చేసి వీఎల్టీ వసూలు చేయాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మురుగునీటిని బయటకు పంపేందుకు స్థల యజమానులతో మాట్లాడి పైపులు వేయాలన్నారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బి.మహాలక్ష్మినాయుడు, సూరిబాబు, శానిటరీ సెక్రటరీలు మనోజ్, ప్రసాద్, సూపర్‌వైజర్లు సూరిబాబు, నాగేంద్ర, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ శిల్లా కరుణాకరరెడ్డి, అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, ప్రధానకార్యదర్శి చిప్పాడ వెంకటేష్, కంచుబోయిన వెంకటరావు, పట్నాల రాము, సరగడ నాగిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రశాంతిరెడ్డి


వేదాశీర్వాదం అందుకుంటున్న ప్రశాంతిరెడ్డి

కొమ్మాది: రుషికొండలో గల మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామిని సోమవారం ఢిల్లీ టీటీడీ లోకల్ ఏరియా కమిటీ చైర్మన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆమెకు టీటీడీ అర్చకులు వేదాశీర్వాదంతో పాటు ప్రసాదాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో సముద్రానికి అభిముఖంగా శ్రీవారి ఆలయ నిర్మాణం చేయడం ఎంతో అద్భుతమన్నారు. ఈమె వెంట ఆలయ ఏఈవో రమేష్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా పార్లమెంటరీ యువజన అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఏఎన్‌ఎం ఎస్.హేమలత, ఆశావర్కర్ మాదాబత్తుల స్వాతి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైరల్ జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థుల నుంచి రక్తపూతలు సేకరించారు. అవసరమైన వారికి మాత్రలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. వైద్య సిబ్బందికి హెచ్‌ఎం అప్పలరాజు, ఉపాధ్యాయులు రమేష్, నాగమణి, మల్లిక సహకరించారు.

కార్పొరేట్ కాలేజీలకు దీటుగా సదుపాయాలు

భీమిలి డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా స్థానిక డిగ్రీ కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల తెలిపారు. సోమవారం విద్యార్థుల కోసం కళాశాలలో ఓపెన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలో సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, గ్రంథాలయంతోపాటు ఇతర సదుపాయాలను చూశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ అనుభవమున్న అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. ఇక్కడ క్రీడా మైదానంతోపాటు సామగ్రి అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఇంటర్ పూర్తయ్యాక విద్యార్థులు తమకు నచ్చిన గ్రూప్‌ల్లో చేరవచ్చని, తమ కళాశాలలో చదివే మంచి అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నష్ట పరిహారం కోసం రైతుల ఆందోళన

పద్మనాభం: మండలంలోని గంధవరంలో జగనన్న పట్టణ గృహ అభివృద్ధి పథకానికి తమ నుంచి తీసుకున్న భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ సోమవారం లేఅవుట్ వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మందికి అసలు నష్టపరిహారం ఇవ్వలేదని, మరి కొంత మందికి భూములకు తగ్గట్టుగా ఇవ్వలేదని తెలిపారు. తమకు నష్ట పరిహారం ఇవ్వడంలో జాప్యానికి కారణమైన గంధవరం వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

మూడు వేల మందికి అన్నదానం

పద్మనాభం: శివరాత్రి సందర్భంగా మండలంలోని కృష్ణాపురంలో బొడ్డు వారి కుటుంబ సభ్యులు సోమవారం మూడు వేల మందికి అన్నదానం చేశారు. కృష్ణాపురంతో పాటు పద్మనాభం, అర్చకునిపాలెం, ఇసకలపాలెం గ్రామాలకు చెందిన వారు ఈ అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

రోడ్డుపై నిర్మాణంతో ఇక్కట్లు


రోడ్డును కలుపుకొని జరుగుతున్న నిర్మాణం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ పరిధి పుక్కళ్లపాలెంలో ఓ వ్యక్తి రోడ్డును కలుపుకొని నిర్మాణం చేపట్టడంతో స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలోగల స్పందనలో ఫిర్యాదు చేశారు. వాస్తవానికి ఈ ప్రాంతానికి కేవలం పది అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీలు, వాటరుపైప్ లైన్ వేసేందుకు గతంలో అధికారులు కాస్త స్థలాన్ని వదిలిపెట్టారు. అయితే ఆ వ్యక్తి ఖాళీ స్థలంతో పాటు రోడ్డులో కొంత మేర ఆక్రమించి ఇల్లు నిర్మించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని ఇక్కడ వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం


శాంతి కల్యాణం జరుపుతున్న అర్చకస్వాములు

పద్మనాభం: స్థానిక అనంత పద్మనాభ స్వామి ఆలయంలో సోమవారం శాంతి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశాఖ జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దాట్ల పెదబాబు, దంపతులు ఈ కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త డ్రైనేజీలతో అవస్థలు


డ్రైనేజీ పక్కన అడ్డంగా పెట్టిన రేకులు

తగరపువలస: భీమిలి రహదారిని ఆనుకుని గతంలో ఉన్న డ్రైనేజీలు ప్రస్తుతం పూర్తిగా ఆకారం కోల్పోయి అస్తవ్యస్తంగా తయారవడంతో ఆ ప్రాంత వాసులు అవస్థలకు గురవుతున్నారు. చాలాఏళ్ల కిందట రాతితో నిర్మించిన ఈ డ్రైనేజీలు ఇప్పుడు ఆనవాళ్లు లేకుండా పోయాయి. చిట్టివలస చెరువుకు అనుసంధానంగా ఉండే ఈ డ్రైనేజీల నుంచి మురుగునీరు తగరపువలస-భీమిలి రోడ్డు ద్వారా ప్రవహించి మొదటి మదుం కింద నుంచి లోపలికి ప్రవేశిస్తుంది. చిట్టివలస శ్రీకృష్ణ జూనియర్ కళాశాల వద్ద మొదలైన డ్రైనేజీ గణేష్ థియేటర్ కూడలి, పాత ఆంధ్రాబ్యాంకు కూడలి, రజక సంతపేట, తిరుమల కల్యాణ మండపం మీదుగా గతంలో ఉండేది. ఈ డ్రైనేజీ కూడా పూర్తిగా శిథిలమైంది. దీంతో వర్షం పడితే నీరు వెళ్లే మార్గంలేక స్థానికులు అవస్థలకు గురవుతున్నారు. భీమిలి రోడ్డులో దుకాణాలు, ఇళ్లు నిర్మించుకునేవారు వర్షం నీటి నుంచి రక్షణ కోసం ఇంటి ముందు పైపులు వేసి దానిపై శ్లాబులు, సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసుకున్నారు. అయినప్పటికీ భారీ వర్షాలు కురిసిన సమయంలో డ్రైనేజీ నిండిపోయి ప్రధాన రహదారులను నీరు ముంచెత్తుతోంది. ప్రస్తుతం భీమిలి రోడ్డు డ్రైనేజీతో పాటు తాతా థియేటర్ డౌన్‌లో అంసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీ నిర్మాణం కూడా చేపట్టవలసి ఉంది. ఈ డ్రైనేజీలు శిథిలమవడంతో రెండు వైపులా మట్టితో పూడుకుపోయి మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా ఉంది.

తారకరత్నకు ఘన నివాళి

భీమునిపట్నం: సినీనటుడు నందమూరి తారకరత్నకు సోమవారం ఇక్కడ మూడవార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు చురకల రమణ, కాసరపు నాగరాజు, కంచెర్ల కామేష్, మారోజు సంజీవరావు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్నాక్స్


విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

ఆనందపురం : గొట్టిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమ వారం నుంచి స్నాక్స్ పంపిణీ ప్రారంభించారు.

పదో తరగతి పరీక్షలు అయినంత వరకూ ప్రతీ రోజు సాయంత్రం 80 మంది విద్యార్థులకు ఈ ఆహారం అందజేయనున్నారు. సత్యసాయి సేవా సంస్థలు, భజన మండలి సభ్యులు, విశాఖకు చెందిన సాయి భక్తుడు పి.ఎస్.ఎన్. మూర్తి సంయుక్త ధన సాయంతో ఈ పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.సన్యాసిరావు, సత్యసాయి ఆదర్శ గ్రామం కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, కో-కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు, డి.పి.రాజు, బాల వికాస్ కో-ఆర్డినేటర్లు డి.సంతోష్ కిరణ్, వత్సవాయి కృష్ణమూర్తిరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విశాఖ రాజధానితోనే ఉత్తరాంధ్రకు మంచి భవిష్యత్తు


జై విశాఖ అంటూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఆనందపురం : విశాఖ రాజధాని అయితేనే ఉత్తరాంధ్రాకు భవిష్యత్తు ఉంటుందని ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్, అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ చెప్పారు. మండలంలోని శొంఠ్యాంలో ఉన్న ఎస్ఎస్ ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పరిపాలనా రాజధాని అయితే అభివృద్ధిలో వెనుకబడి ఉన్న ఉత్తరాంధ్రలో ఐటీ రంగం అభివృద్ధి చెంది, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. తద్వారా వలసలను అరికట్టవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు జై విశాఖ అంటూ నినాదాలు చేశారు. విశాఖ పరిపాలనా రాజధాని చేయాలని కోరారు.

అర్జీలకు రసీదులు ఇవ్వకపోతే చర్యలు

జెడ్సీ కనకమహాలక్ష్మి


సమీక్ష నిర్వహిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: సచివాలయాల్లో స్వీకరించే ప్రతీ అర్జీ, ఫిర్యాదులకు కచ్చితంగా రసీదు ఇవ్వాలని జీవీఎంసీ మధురవాడ జోన్-2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి ఆదేశించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో రెవెన్యూ వసూళ్లు, ఇతర అంశాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయంలో వివిధ రకాల సేవలు, సమస్యలపై వస్తున్న అర్జీలు, ఫిర్యాదులకు రసీదు ఇవ్వలేదని ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయడానికే సచివాలయ వ్యవస్థ అన్న విషయాన్ని అంతా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. జోన్‌లో ఉన్న అన్ని సచివాలయాల అడ్మిన్లు జీవీఎంసీ ఆదాయం పెంచడంపై దృష్టి సారించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ముగడ రాజు పాల్గొన్నారు.

నష్టపోయిన వినియోగదారులు పరిహారం పొందవచ్చు


విద్యార్థులతో లజపతిరాయ్

ఆనందపురం : వస్తువులు కొనుగోలు చేసిన వినియోగదారులు మోసపోతే నష్ట పరిహారం పొందే అవకాశం ఉందని అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ చెప్పారు. మండలంలోని శొంఠ్యాంలో ఉన్న ఎస్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు వినియోగదారుల రక్షణ చట్టం-2019 గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లజపతిరాయ్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రతీ వ్యాపారంలోను మోసం జరుగుతోందన్నారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండక పోతే నష్టపోతారని చెప్పారు. వస్తు నాణ్యతతో పాటు, తూకంలోను మోసాలు జరుగుతాయన్నారు. కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించిన ధరకు రసీదుని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. మోసం జరిగినట్టు భావిస్తే కొనుగోలు చేసిన రసీదుతో జిల్లా వినియోగదారుల సేవా సంస్థకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. విచారణ జరిపి వినియోగదారులకు న్యాయం చేయడంతో పాటు మోసం చేసే వ్యాపారులకు శిక్ష కూడా విధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి బాల, కళాశాల డీన్ ఎ.వి.ఎస్.ఎన్. శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

'చెత్త' పన్నుపై అపోహలు వీడాలి


చిట్టివలస జెడ్పీహైస్కూల్‌లో మాట్లాడుతున్న భీమిలి జెడ్సీ రాము

తగరపువలస: చెత్త పన్నుపై ప్రజలు అపోహలు వీడాలని, ఇది రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించేది కాదని, ప్రజల ఆరోగ్యం కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన యూజర్ చార్జీలని భీమిలి జెడ్సీ బొడ్డేపల్లి రాము సోమవారం చిట్టివలస జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు వివరించారు. స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లోనే తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేరు చేసి, ఎప్పటికప్పుడు క్లాప్ వాహనాలకు స్వచ్ఛందంగా ఇవ్వడం వల్ల ఇంట్లో ప్రమాదకరమైన బ్యాక్టీరియా, దోమలకు అవకాశం ఉండదన్నారు. రూ.60 చెత్త పన్ను చెల్లించకుండా చెత్తను ఇంట్లో, ఇంటి పక్కన నిల్వ చేసుకోవడం వల్ల డెంగీ, సీజనల్ జ్వరాలు వృద్ధి చెంది తద్వారా ప్రాణాల మీదకు వచ్చి ఆస్పత్రులకు రూ.లక్షలు పోస్తున్నారని చెప్పారు. చెత్తపన్ను అనేది కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు ప్రతీ రాష్ట్రంలో అమలులో ఉందని తెలిపారు. చెత్తను వేరుచేయని కారణంగా తెలంగాణ ప్రభుత్వం రూ.3,500 కోట్లు చెల్లించిందన్నారు. ప్రతీరోజు జీవీఎంసీ పరిధిలో 25 లక్షల పాలిథిన్ సంచుల కారణంగా పక్షులు, జంతువులు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పాలిథిన్ సంచుల నిర్మూలనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. 3 నుంచి 7 రోజుల్లో పెరిగే దోమల నిర్మూలనకు ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బి.మహాలక్ష్మినాయుడు, బొట్టా శ్రీకాంత్, సెక్రటరీలు సురేష్, పైడిరాజు, అఖిల్, కిరణ్, సూపర్‌వైజర్లు సూరిబాబు, నాగేంద్ర, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన'కు ముచ్చటగా 3 అర్జీలు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

మధురవాడ: ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నా కొంత మంది అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో జీవీఎంసీ మధురవాడ జోన్-2లో సోమవారం నిర్వహించిన స్పందన వెల వెలబోయింది. కేవం 3 అర్జీలు మాత్రమే రాగా అన్నీ టౌన్ ప్లానింగ్‌కి విభాగానికి చెందినవే. ఇందులో రెండు వ్యక్తి గత సమస్యలకు సంబంధించినవి. బక్కన్నపాలెంలో దుర్గాలమ్మ గుడి తూర్పు పక్కన గుడికి సంబంధించిన స్థలాన్ని ఓ బిల్డర్ ఆక్రమించి గేట్ నిర్మాణం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని కాలనీ వాసులు బి.పోతురాజు తదితరులు ఆరోపించారు.

అంతంత మాత్రంగా అధికారుల హాజరు

స్పందన 10గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 10.45 నిమిషాలు వరకు కూడా ఎక్కువ మంది అధికారులు హాజరు కాలేదు. జెడ్సీతో పాటు సూపరింటెండెంట్, తాగునీటి విభాగం డీఈ వంటి హెచ్‌వోడీలతో పాటు కిందస్థాయి సిబ్బంది మాత్రమే హాజరు అయ్యారు.

పారిశుధ్య లోపంపై ఫిర్యాదు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు కొండపేటలో పారిశుధ్య లోపం, దోమల సమస్యపై స్థానికులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దోమలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన అధికారులు కొండపేటలో ఫాగింగ్ చేయించారు. మంగళవారం డ్రైనేజీలను శుభ్ర పరచనున్నట్టు సచివాలయ సిబ్బంది తెలిపారు.

స్పందన వినతులకు సత్వర పరిష్కారం

భీమునిపట్నం: స్పందనలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. సోమవారం ఇక్కడ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐదు వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ స్పందనలో వచ్చే వినతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు.